www.prajasakti.com

ప్రజాశక్తి

ఆదివారం 8 డిసెంబర్ 2024

5

చిత్తూరు

నేడు డిఆర్‌సి సమావేశం

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: జెడ్‌పి మీటింగ్ హాల్‌లో జిల్లాస్థాయి సమీక్షా సమావేశం నిర్వహించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లా స్థాయి సమీక్షా సమావేశం (డిఆర్‌సి) ఈనెల 8న ఆదివారం ఉదయం 10 గంటలకు జిల్లా ఇంచార్జ్ మంత్రి రాష్ట్ర రవాణా శాఖమంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి అధ్యక్షతన నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఈ సమీక్షా సమావేశంలో పార్లమెంటు సభ్యులు, జెడ్పి ఛైర్మన్, జిల్లాలోని శాసనమండలి సభ్యులు, శాసనసభ్యులు, ప్రజాప్రతినిధులు ఈ సమీక్షా సమావేశానికి హాజరు కానున్నారన్నారని కలెక్టర్ తెలిపారు.

పోలీస్ కుటుంబాలకు ఆర్థిక సాయం

అడిషనల్ ఎస్పీ రాజశేఖర్‌రాజు

చెక్కును అందిస్తున్న అడిషనల్ ఎస్పీ రాజశేఖర్‌రాజు

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్ జిల్లా పెనుమూరు పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వహిస్తూ ఆగస్టు 19 తేదీన అనారోగ్యం కారణంగా మరణించిన సూరిబాబు సతీమణి సుజాతకి, ఆగస్టు 27న వెదురుకుప్పం పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తూ మరణించిన సుదర్శన రాజు సతీమణి హేమలతకి కార్పస్ ఫండ్ నుండి శనివారం ఒక్కొక్కరికి రూ.1,00,000లు చొప్పున మొత్తం 2 లక్షల రూపాయల చెక్కులను, చిత్తూరు జిల్లా ఎస్పీ మణికంఠ చందోలు ఆదేశాల మేరకు అడిషనల్ ఎస్పీ ఆపరేషన్స్ ఇంచార్జ్ అడ్మిన్ రాజశేఖర్ రాజు అందించారు. ఈ సందర్భంగా అడిషనల్ ఎస్పీ మాట్లాడుతూ చనిపోయిన వారి కుటుంబ సభ్యులను పరామర్శించి, పోలీస్ శాఖ తరపున వారికి అన్ని విధాల సహాయం అందిస్తామని హామీ ఇచ్చారు. పోలీస్ డిపార్టుమెంటు తరపున కుటుంబానికి అందాల్సిన ప్రయోజనాలు ఆలస్యమవ్వకుండా చూస్తామని, ఏవైనా సమస్యలుంటే నిరభ్యంతరంగా సంప్రదించవచ్చని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా పోలీస్ కార్యాలయ బి-సెక్షన్ సూపరింటెండెంట్ సుబ్రహ్మణ్యం, క్లర్క్ పార్థసారధి నాయుడు పాల్గొన్నారు.

ఇన్‌చార్జి ఎస్పీగా సుబ్బరాయుడు

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: చిత్తూరు జిల్లా ఎస్పీ మణికంఠ చందోలు శనివారం నుండి ఐదు రోజుల పాటు సెలవులో వెళ్ళడంతో అనంతపురంరేంజ్ డిఐజి డాక్టర్ షేముషి బాజ్పేయ్ తిరుపతి జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బారాయుడుని చిత్తూరు జిల్లా ఇన్‌ఛార్జ్ ఎస్పీగా నియమించారు.

సాయుధ దళాల సేవలను గౌరవిద్దాం

- **దేశ రక్షణలో వారి పాత్ర వెలకట్టలేనిది: కలెక్టర్**

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: సాయుధ దళాల పతాక దినోత్సవం సందర్భంగా నిర్వహించే నిధికి ప్రతిఒక్కరూ సహకరించాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ పేర్కొన్నారు. శనివారం స్థానిక జిల్లా కలెక్టర్ బంగ్లాలో జిల్లా సైనిక సంక్షేమశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన సాయుధ దళాల పతాక దినోత్సవం (ఫ్లాగ్ డే) సందర్భంగా ఫ్లాగ్ డే నిధికి విరాళ సేకరణ కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ దేశ రక్షణలో సాయుధ దళాల పాత్ర వెలకట్టలేనిదని, దేశ రక్షణ కోసం ప్రాణాలు కోల్పోయిన సైనికులను స్మరించుకునేందుకు ప్రతీ సంవత్సరం డిసెంబర్ 7న దేశవ్యాప్తంగా ఫ్లాగ్ డే నిర్వహించుకుంటున్నామని తెలిపారు. అటువంటి త్యాగధనుల కుటుంబాలలోని వారి పిల్లల స్కాలర్ షిప్స్, ఆడపిల్లలకు వివాహాలు మొదలైన కార్యక్రమాల కొరకు ఫ్లాగ్ డే ఫండ్ పయోగపడుతుందని తెలిపారు. మన సైనికులు దేశం సరిహద్దులలో పనిచేసిన ఉత్సాహంతో అదే స్ఫూర్తితో దేశంలో వరదలు, తుపానులు వంటి ప్రకృతి వైపరీత్యాల సమయంలో కూడా తమ అమూల్యమైన సేవలు స్వచ్ఛందంగా అందచేస్తుంటారని, అటువంటి మాజీ సైనికుల సంక్షేమానికి ఫ్లాక్ డే నిధికి మన వంతు సహకారం అందించడం పౌరులుగా మన కనీస బాధ్యని తెలిపారు. జిల్లా సైనిక సంక్షేమ అధికారి కెవి.రాఘవులు, సిబ్బంది ప్రమోద్ కన్నా, వినాయక రెడ్డి, సాయిప్రకాష్, కె.రమేష్, మాజీ సైనికులు కె.వరదరాజులు, రామచంద్ర, ఎన్‌సిసి, అధికారులు, క్యాడిడేట్స్ పాల్గొన్నారు.

సైనిక సంక్షేమం కోసం విరాళం అందిస్తున్న జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్

సమస్యలు తీరేనా..!

- **సదస్సులు.. ఆత్మీయ సమావేశాలు**

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్

ప్రజాదృష్టి

భూములు లాక్కుంటున్నారు.. శ్మశానాలు ఆక్రమించుకుటున్నారు.. అడంగల్ మార్చేస్తున్నారు.. ప్రభుత్వ భూములను కబ్జా చేస్తున్నారు.. ప్రజాసమస్యల పరిష్కరవేదిక.. అది మండలమైనా జిల్లా అయినా ఎక్కడ నిర్వహించినా న్యాయం చేయండి అంటూ బడుగు, బలహీన పేదల వర్గాలకు చెందినవారు నెత్తినేరు కొట్టుకుంటూ అధికారుల దృష్టికి సమ్యలు తీసుకొస్తున్నారు. గత ప్రభుత్వం స్పందన అన్నా.. ప్రస్తుత కుటమి ప్రభుత్వం ప్రజాసమస్యల పరిష్కర వేదిక అన్నా రెవెన్యూ సమస్యలే 80 శాతం ఉంటున్నాయి. ఎకరం, అరఎకరం సాగు భూములు సైతం మా ఆధీనం ఉండనివ్వడం లేదని, స్మశానాలు కబ్జా చేస్తున్నారని. ప్రభుత్వం మంజురు చేసిన ఇండ్లు పేర్లు మార్చేస్తున్నారంటూ దళిత, గిరిజన, బడుగు బలహీన వర్గాలు ప్రభుత్వ ఆధికారులను ఆశ్రయిస్తున్నా ఏండ్ల తరబడీ రెవెన్యూ సమస్యలు కొరకరాన్ని కొయ్యలుగా మిగిలిపోతున్నాయి. ప్రభుత్వాలు మారాయి.. సమస్యలు పరిష్కరిస్తామంటూ రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నారు. బాధితుల నుండీ అర్జీలు స్వీకరిస్తూ పెత్తందార్లు, రాజకీయ నేతలు, ప్రజాప్రతినిధుల ఒత్తిళ్ళతో వెన్నకు తగ్గడంతో రెవెన్యూ సమస్యలు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్లుగా ఉంటోంది. కూటమి ప్రభుత్వం ఈనెల 6వ తేదీ నుంచి జిల్లావ్యాప్తంగా రెవెన్యూ సమస్యల పరిష్కారం కోసం రెవెన్యూ సదస్సులను ప్రారంభించింది. చిత్తూరు జిల్లాలోని 32 మండలాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నారు. గ్రామ పంచాయతీ పరిధిలోని అన్నిరకాల సమస్యలు నిర్భయంగా రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకుపోవచ్చు అయితే ఇక్కడో చిక్కుంది. ఆ గ్రామాల్లో గత, ప్రస్తుత ప్రజాప్రతినిధులు భూకబ్జాలు, ఆక్రమణలను రెవెన్యూ సదస్సుల్లో ప్రజాప్రతినిధుల సమక్షంలో రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకుపోవడం సాధ్యమేనా అనే ప్రశ్న తలెత్తుతోంది. క్షేత్ర స్థాయిలో రెవెన్యూ సమస్యలను తహశీల్దార్, విఆర్ఒ పరిష్కరిస్తే ఈ రిస్థితి ఉండదంటున్నారు. గతంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ప్రజల నుండీ అందిన పిర్యాదులు చిత్తశుద్ధితో రెవెన్యూ అధికారులు పరిష్కరించకపోవడంతో సమస్యలు పెరుగున్నాయి. అలాగే విద్యార్థుల తల్లిదండ్రుల పాఠశాల కమిటీ ఆత్మీయ సమావేశాలు నిర్వహిస్తున్న ప్రభుత్వం ఆ పాఠశాల విద్యార్థుల సంఖ్య పెంచడం, ఉపాధ్యాయల ఖాళీల భర్తీ, మౌలిక వసతుల కల్పిన వంటి అంశాలపై దృష్టిపెట్టాలని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు. ఏది ఏమైన్నప్పటికీ ప్రభుత్వం నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులు, తల్లిదండ్రుల ఆత్మీయ సమావేశాలు సమస్యల పరిష్కారానికి, ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి తోడ్పాటును అందించాలి. ఉత్తుత్తి సదస్సులు, ఆత్మీయ సమావేశాలుగా రెవెన్యూ సదస్సులు, ఆత్మీయ సమావేశాలు మారితే ప్రయోజనం ఏమిటి..?

డ్రగ్స్ వద్దు బ్రో..

పోలీస్‌శాఖ విస్తృత ప్రచారం

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: డ్రగ్స్ వద్దు బ్రో.. అంటూ పోలీస్‌శాఖ విద్యార్థుల్లో విస్తృత ప్రచారానికి శ్రీకారం చుట్టింది. ప్రతి రోజూ కొత్త ఆశతో మొదలు పెట్టండి, మత్తుకు దూరంగా ఉండండి.. డ్రగ్స్ వద్దు బ్రో, ఇది నీ జీవన విధానాన్ని చంపుతుంది.. మీ భవిష్యత్తు ప్రకాశవంతంగా మార్చుకోండి.. పుస్తకాలు పట్టుకోవడం మీ భవిష్యత్తు, మత్తు పదార్థాలు మరిచిపోవడం మీ జీవితాన్ని బాగుచేస్తుందంటూ ప్రభుత్వ ఆదేశాల మేరకు 'డ్రగ్స్ వద్దు బ్రో' అనే నినాదంతో జిల్లా వ్యాప్తంగా ఉన్న అన్ని పాఠశాలల్లో మెగా టీచర్స్-పేరెంట్ మీటింగ్‌లు జిల్లా పోలీస్ మత్తుపదార్థల వాడకం వల్లి కలిగే అనర్థాలపై విద్యార్థులకు సైబర్ యాంటి డ్రగ్స్, మహిళా భద్రత, ట్రాఫిక్ నిబంధనలపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నారు. శనివారం చిత్తూరు నగర పరిధిలోని జిల్లా పరిషత్ పాఠశాలలో నిర్వహించిన మెగా టీచర్స్ పేరెంట్ మీటింగ్‌లో అడిషనల్ ఎస్పీ ఆపరేషన్స్, అడ్మిన్ ఇంచార్జ్ ఎస్.ఆర్.రాజశేఖర్ రాజు మత్తుపదార్థల వల్ల కలిగే అనర్థాలను విద్యార్థులకు తెలియజేశారు. తల్లిదడ్రుల పర్యవేక్షణలో పిల్లలపై ఎప్పుడూ ఉండాలి స్నేహపూర్వక సంబంధాలు పెంచుకోవాలన్నారు. పరిశర ప్రాంతాలలో, పాఠశాలలో, ఏ ఇతర ప్రదేశాలలో డ్రగ్స్ వాడకం లేదా అమ్మకం ఉన్నట్లు అనుమానం కలిగితే మీ ప్రాంత పోలీస్ స్టేషన్‌లో కానీ డయల్ 112, చిత్తూరు పోలీస్ వాట్స్యాప్ నెంబర్ 9440900005 కు సమాచారం అందించి డ్రగ్స్ ఫ్రీ సమాజాన్ని నిర్మించేందుకు సహకరించాలని కోరారు.

కలిసికట్టుగా ప్రజలకు మంచి చేద్దాం..

పార్టీలకు అతీతంగా నగరాభివృద్ధి : ఎమ్మెల్యే గురజాల

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: పార్టీలకు అతీతంగా సభ్యులంతా సమన్వయంతో కలిసికట్టుగా చిత్తూరు నగరాభివృద్ధికి కృషి చేద్దామని చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ పిలుపునిచ్చారు. శనివారం చిత్తూరు నగరపాలక సంస్థ కౌన్సిల్ సాధారణ సమావేశం నగర మేయర్ ఎస్. అముద అధ్యక్షతన జరిగింది. సమావేశానికి ఎక్స్ అఫిషియో సభ్యుల హోదాలో చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ హాజరై మాట్లాడారు. సమావేశంలో సభ్యులు లేవనెత్తిన వివిధ సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. చిత్తూరు నవరాభివృద్ధికి అన్ని రకాలుగా ప్రయత్నాలు చేస్తున్నామని, ఇందుకు సభ్యుల సహకారం కావాలన్నారు. చిత్తూరు నగర సమగ్రాభివృద్ధి, నగరంలో నీవానది పొడవునా రీటైనింగ్ వాల్, యూనివర్సిటీ స్థాపన, ఇరువారం నుంచి తానా వరకు, కట్టమంచి నుంచి కలెక్టరేట్ వరకు ప్రధాన రహదారుల అభివృద్ధి కోసం నిధులు మంజూరు చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబుకి విన్నవించడం జరిగిందని, సీఎం సానుకూలంగా స్పందించి నిధులు మంజూరుకు చర్యలు తీసుకుంటామని చెప్పారన్నారు. నగరంలో నీటి సమస్యలు పరిష్కరించేందుకు అధికారులు వేగంగా స్పందించాలని, చిన్నపాటి మరమ్మతులను ఎప్పటికప్పుడు పూర్తి చేయాలన్నారు. గాంధీ సర్కిల్ వద్ద బస్సు షెల్టర్ల నిర్మాణాన్ని అపోలో వారి సహకారంతో పూర్తి చేస్తాన్నారు. కొత్తగా ఇల్లు నిర్మించుకునే వారి కోసం ప్రభుత్వ ఇల్లు మంజూరు చేస్తుందని, నిజంగా ఇల్లు లేని, అర్హులైన వారిచే కార్పొరేటర్లు శ్రద్ధ తీసుకొని దరఖాస్తు చేయించాలన్నారు. ఈసమావేశంలో భాగంగా మేయర్ ఆమోదంతో అజెండా అంశాలపై చర్చించారు. అజెండా అంశాల్లో భాగంగా 15వ ఆర్థిక సంఘం నిధుల వినియోగం సంబంధించి గడిచిన సమావేశాల్లో తీసుకున్న నిర్ణయాల మేరకు, ముందస్తు అనుమతి పొందిన పనులకు నిధుల కేటాయింపు, పాత ప్రతిపాదనల స్థానంలో కొత్త ప్రతిపాదనలను చర్చించారు. చిత్తూరు నగరపాలక సంస్థ పరిధిలో చిత్తూరు మండలం మంగసముద్రం రెవెన్యూ గ్రామానికి సంబంధించి సర్వే నెంబరు 164, 165, 166, 167, 168/1, 169, 170లోని భూమిని జిల్లా కలెక్టర్ వారి ఆదేశాల మేరకు కేంద్ర విద్యాలయం పాఠశాల ఏర్పాటు చేయుటకై రెవెన్యూ శాఖకు బదిలాయించడంపై చర్చించారు. అలాగే నగరపాలక సంస్థ పరిధిలోని ప్రధాన కూరగాయల మార్కెట్, జంతు వధశాల, కాసు బ్రహ్మానందరెడ్డి, ఎన్టీఆర్ బస్టాండ్లలో గుత్త వసూళ్లకు గతంలో టెండర్ పొందిన వారు వేలంపాట మొత్తాన్ని చెల్లించకపోవడంతో సదరు వేలం పాటను రద్దు చేయటకు, కలిగిన నష్టాన్ని వసూలు చేయుటకు, తిరిగి వేలంపాట నిర్వహించడానికి, అప్పటివరకు డిపార్ట్మెంట్‌చే వసూలు, నగరపాలక సంస్థ పరిధిలో వివిధ ప్రాంతాల్లోని షాపింగ్ కాంప్లెక్స్‌లలో ఖాళీగా ఉన్న షాపులకు ఇటీవల నిర్వహించిన వేలంపాటలో హెచ్చు పాటదారులకు షాపులు కేటాయించటం, నగరపాలక సంస్థలో ఆప్కాస్ ద్వారా విధులు నిర్వహిస్తూ మృతి చెందిన బోర్ ఆపరేటర్లు, పబ్లిక్ హెల్త్ వర్కర్లకు ఎక్స్ గ్రేషియా చెల్లించడం జరిగింది. అలాగే నగరపాలక సంస్థకు చెందిన ప్రాంతాల్లోని షాపింగ్ కాంప్లెక్స్‌లో దుకాణాలకు అద్దె బకాయిలను పూర్తిగా చెల్లించిన వారికి కాలపరిమితి ముగిసినందున ప్రభుత్వ నిబంధనలను ప్రకారం 33.3 శాతం అద్దె పెంచి రెన్యువల్ చేయాలని, తహశీల్దార్ లేఖ మేరకు నగరపాలక సంస్థ పరిధిలో వివిధ ప్రాంతాల్లో సంస్థలు, కార్యాలయాలకు ఇదివరకే కలెక్టర్ ఆదేశాల మేరకు ముందస్తుగా అప్పగించిన భూములకు సంబంధించి ఆమోదించారు. కౌన్సిల్ సమావేశంలో సభ్యులు లేవనెత్తిన సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని కమిషనర్ పి.నరసింహ ప్రసాద్ చెప్పారు. డిప్యూటీ మేయర్ ఆర్.చంద్రశేఖర్, సహాయ కమిషనర్ ఎ.ప్రసాద్, కార్పొరేటర్లు, కో ఆప్షన్ సభ్యులు, ఎంహెచ్ఓ డాక్టర్ లోకేష్, ఎంఈ వెంకటరామి రెడ్డి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

కౌన్సిల్ సమావేశంలో మాట్లాడుతున్న మేయర్ అముద, సమావేశానికి హాజరైన కౌన్సిలర్లు

జిల్లాలోని 2,451 పాఠశాలల్లో పేరెంట్స్ టీచర్స్ ఆత్మీయ సమావేశాలు

విద్యారంగంలో మార్పులు చేపట్టాలి : కలెక్టర్

బంగారుపాళ్యంలో కలెక్టర్, ఎమ్మెల్యే

ప్రజాశక్తి- బంగారుపాళ్యం: విద్యారంగంలో మార్పులు చేపట్టాలని కలెక్టర్ సుమిత్ కుమార్, పూతలపట్టు ఎమ్మెల్యే డాక్టర్ కలికిరి మురళీమోహన్ తెలిపారు. శనివారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో తల్లిదండ్రులు బడివైపు ఒక అడుగు కార్యక్రమం ఎంఈవో నాగేశ్వరరావు ఆధ్వర్యంలో జరిగింది. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. టిడిపి మండల అధ్యక్షులు జయప్రకాష్ నాయుడు, తహశీల్దార్ బాబు రాజేంద్రప్రసాద్, ఎంపీడీవో శ్రీధర్, సిఐ శ్రీనివాసులు, మండల విద్యాశాఖ అధికారి 2 రమేష్ బాబు, జీఆర్ కన్స్ట్రక్షన్ అధినేత ఈశ్వర్ నాయుడు, సర్పంచులు ఉమాదేవి, కోకా ప్రకాష్ నాయుడు, ప్రధానోపాధ్యాయులు రాజేంద్ర పాల్గొన్నారు.

చిత్తూరుఅర్బన్: గుడిపాల మండలం కమ్మతిమ్మాపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం జరిగిన మెగా పేరెంట్స్ టీచర్స్ సమావేశానికి ఎమ్మెల్యే గురజాల జగన్‌మోహన్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. విద్యార్థులను దేశానికి ఉపయోగపడే మంచి పౌరులుగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత టీచర్లు, తల్లిదండ్రులపై ఉందని సాంఘిక సంక్షేమ సాధికారత అధికారిణి డాక్టర్ రాజ్యలక్ష్మి పేర్కొన్నారు. శనివారం స్థానిక డాక్టర్ బిఆర్ అంబేద్కర్ గురుకులం, ఆంధ్రప్రదేశ్ గిరిజన సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో పేరెంట్స్, టీచర్స్ ఆత్మీయ సమావేశంలో జిల్లా గిరిజన సంక్షేమ మరియు సాధికారత అధికారి ఎస్.మూర్తి, ప్రిన్సిపాల్స్ ఆర్.అరుణ, రేఖ పాల్గొన్నారు.

విద్యార్థులు క్రమశిక్షణతో ఎదగాలి :మేయర్

విద్యార్థులు క్రమశిక్షణతో ఎదగాలని, వారిని మంచి వైపు నడిపించే బాధ్యత ఉపాధ్యాయులు, తల్లిదండ్రులపై ఉందని మేయర్ ఎస్.అముద చెప్పారు. శనివారం గాండ్లపల్లి నగరపాలక ఉన్నత పాఠశాలలో మెగా టీచర్స్, పేరెంట్స్ సమావేశానికి మేయర్, కమిషనర్ పి.నరసింహ ప్రసాద్‌లు హాజరయ్యారు. నాణ్యమైన విద్యను అందించడానికి ఉపాధ్యాయులు కృషి చేయాలని, విద్యార్థులు చదువుతున్న తీరును, వారి ప్రవర్తనను తల్లిదండ్రులు ఎప్పటికప్పుడు తెలుసుకోవాలన్నారు. సమావేశంలో కార్పొరేటర్ భాగ్యలక్ష్మి, పేరెంట్స్ కమిటీ చైర్మన్, సభ్యులు, హెచ్‌ఎం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఐరాల: మండలంలోని 65 పాఠశాలలో శనివారం జరిగిన మెగా పేరెంట్స్, టీచర్స్ మీటింగ్ విజయవంతమైనట్లు ఐరాల మండలం విద్యాశాఖ అధికారులు రుశేంద్రబాబు, దామోదర్ నాయుడు తెలిపారు. అన్ని పాఠశాలలో 2806 విద్యార్థులకు తల్లిదండ్రుల ఎదుట నివేదిక హెూలీ స్టిక్ ప్రోగ్రెస్ రిపోర్ట్‌ను అందజేశారు. కాణిపాకం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు డిపిఓ సుధాకర్, ఎంపీడీవో ధనలక్ష్మి, విస్తరణ అధికారి కుసుమ కుమారి, సర్పంచ్ శాంతి సాగర్‌రెడ్డి, వైస్ సర్పంచ్ విశ్వనాథరెడ్డి, ఎస్సై ధరణీధర్, మాజీ జెడ్పిటిసి లతా, స్కూల్ చైర్మన్ భాస్కర్, ప్రధానోపాధ్యాయులు చంద్రశేఖర్ నాయుడు పాల్గొని మాట్లాడారు.

చౌడేపల్లి: చౌడేపల్లి ఉన్నత పాఠశాలలో శనివారం ఘనంగా తల్లిదండ్రులు ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశం నిర్వహించడం జరిగింది. మండల అభివృద్ధి అధికారిని లీలామాధవి, పాఠశాల స్థలదాత ఉద్యానవనధాత డాక్టర్ పావులూరి మురళీధర్ నాయుడు, పాఠశాల కమిటీ చైర్మన్ సుధాకర్, మండల సబ్ ఇన్స్పెక్టర్ వి.నాగేశ్వరరావు, మండల విద్యాశాఖ అధికారులు కేశవరెడ్డి, తిరుమలమ్మ, వైద్యాధికారి పవన్ కుమార్, జంపాల శ్రీనివాస్ నాయుడు, ముని వెంకటప్ప, వైస్‌చైర్మన్ రాధిక పాల్గొన్నారు.

పలమనేరు: మండలంలోని 70 ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలో పేరెంట్స్ టీచర్స్ మీటింగు ఘనంగా జరిగింది. బాలికల ఉన్నత పాఠశాల్లో జరిగిన సమావేశంలో మున్సిపల్ కమిషనర్ వెంకటరమణ రెడ్డి, ఎస్ఐ స్వర్ణ తేజ పాల్గొని మాట్లాడారు. దొడ్డిపల్లె ఉన్నత పాఠశాలకు మండల విద్యాశాఖ అధికారి బాల సుందరం, పెంగరగుంట ఉన్నత పాఠశాలకు మండల రెవెన్యూ ఆఫీసర్ ఇన్బనాదం పాల్గొన్నారు.

యాదమరి: విద్యార్థుల జీవితాల్లో మార్పు కోసమే డికె చెరువు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మెగా తల్లిదండ్రుల, ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశాన్ని శనివారం ఘనంగా నిర్వహించినట్లు ప్రధానోపాధ్యాయులు రవీంద్రారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థుల తల్లిదండ్రులకు వివిధ పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. చంద్రశేఖర్, పురుషోత్తం, ఉపాధ్యాయులు బాలసుబ్రమణ్యం, శ్రీరంగలక్ష్మీ, కిరణ్ కుమార్, మణి, గిరిబాబు, ఉమాదేవి పాల్గొన్నారు.

విద్యార్థుల భవిష్యత్తుకు తల్లిదండ్రులు ఉపాధ్యాయుల పాత్ర చాలా కీలకమని మండల విద్యాశాఖ అధికారి హెచ్ఎల్ఎన్ ప్రసాద్ అన్నారు. శనివారం మండలంలోని కె.గొల్లపల్లె హైస్కూల్ ప్లస్ పండుగ వాతవరణంలో పేరెంట్స్, టీచర్స్ సమావేశం జరిగింది. తల్లిదండ్రుల కమీటి చైర్మన్ పి.నవీన కుమార్, సర్పంచ్ రాధ మురళి, ఎంపిటిసి, కమీటి సభ్యులు, తల్లిదండ్రులు పాల్గొన్నట్లు ప్రిన్సిపాల్ ఎపి.లలిత తెలిపారు.

వెదురుకుప్పం: మండలంలోని మాంబేడు పంచాయతీ వేణుగోపాల్‌పురం ప్రాదమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు గువ్వల దేశయ్య ఆధ్వర్యంలో శనివారం తల్లిదండ్రుల ఆత్మీయ సమావేశం జరిగింది. స్థానిక ఎంపీటీసీ గుణశేఖర్ యాదవ్, స్కూల్ కమిటీ చైర్మన్ పాల్గొన్నారు. అలాగే కార్వేటినగరం మండలం ఆర్‌కేవిబి పేట గ్రామపంచాయతీ ఉన్నత పాఠశాలలో పేరెంట్ టీచర్ మీటింగ్ నిర్వహించడం జరిగింది. మండల యూత్ ఆర్గనైజేషన్ సెక్రటరీ ఢిల్లీ బాబు రెడ్డి, ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి చంగల్‌రాయలు పాల్గొని వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.

పెద్దపంజాణి: మంచి సమాజం రూపొందాలంటే మంచి విద్యావ్యవస్థ ద్వారానే సాధ్యమవుతుందని పలమనేరు శాసనసభ్యులు అమర్నాథ్ రెడ్డి అన్నారు. మండలంలోని రాయలపేట ఉన్నత పాఠశాలలో జరిగిన తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశానికి ఎమ్మెల్యే హాజరయ్యారు. వివిధ పోటీలలో గెలుపొందిన విద్యార్థులు వారి తల్లిదండ్రులకు బహుమతులను బహుకరించారు. ఎంపీడీవో బాలాజీ, తహశీల్దార్ ప్రసన్న కుమార్, ఎంఈవోలు గోపాల్‌రెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు రత్నమ్మ, పాఠశాల కమిటీ చైర్మన్ చంద్రయ్య పాల్గొన్నారు.

సదుం: మండల పరిధిలోని ఎంపీపీ పాఠశాలలు, ఎంపీ యూపీ పాఠశాలలు, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో టీచర్స్, పేరెంట్స్ సమావేశం ఆయా ప్రధానోపాధ్యాయుల ఆధ్వర్యంలో ఘనంగా శనివారం నిర్వహించారు. సదుం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఇన్చార్జి ప్రధానోపాధ్యాయులు సుబ్రహ్మణ్య ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఇన్చార్జి ఎంఈఓ -2 దామోదర్, ఎస్సై షేక్ షావలి, కమ్యూనిటీ హెల్త్ సెంటర్ మెడికల్ ఆఫీసర్ పుష్పకుమారి, చెరుకువారిపల్లి హెచ్ఎం సందీప్ కుమార్ రెడ్డి, టిడిపి రాష్ట్ర నాయకులు వై.వెంకట రమణారెడ్డి పాల్గొన్నారు.

వెదురుకుప్పంలో..



శాంతిపురంలో..

కుప్పం టౌన్ : మండల పరిధిలోని దాసేగౌనూరు పాఠశాల సమావేశానికి ఏపీఎస్ఆర్టీసీ ఉపాధ్యక్షులు పిఎస్ మునిరత్నం, కుప్పం పట్టణ పరిధిలోని బాలుర ఉన్నత పాఠశాలలో జరిగిన కార్యక్రమానికి ఎమ్మెల్సీ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్, ఉర్దూ పాఠశాలలో సమావేశానికి నియోజకవర్గ టిడిపి మైనారిటీ అధ్యక్షులు జాకీర్ అహ్మద్, కొత్తపేటలోని పాఠశాల సమావేశానికి నియోజకవర్గ టిడిపి విస్తరణ విభాగ కమిటీ సభ్యులు కన్నన్, కొత్తపేట ఇంచార్జ్ ముఖేష్‌లు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. అలాగే ఆయా పాఠశాలలో ఉన్న సమస్యలను ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకువచ్చారు. వీటిపై స్పందించిన నాయకులు సంబంధిత అధికారులతో చర్చించి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు.

గంగవరం: మండలంలోని అన్ని ప్రాథమిక, ఉన్నత పాఠశాలలో శనివారం తల్లిదండ్రులు ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థుల తల్లిదండ్రులకు క్రీడల పోటీలు ముగ్గుల పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. మండలంలోని కీళ్లపట్ల ప్రాథమిక పాఠశాలలో తల్లిదండ్రులతో పాటు గెలుపొందిన విద్యార్థులకు పథకాలను అందజేసినట్లు ఉపాధ్యాయులు తులసీనారాయణ నాయుడు తెలియజేశారు.

కార్వేటినగరం: కొల్లగుంట యూపి పాఠశాలలో మెగా పేరెంట్స్ టీచర్స్ కార్యక్రమం పండుగ వాతావరణంలో పాఠశాల హెచ్ఎం ఎస్.శ్రీనివాసులు, పాఠశాల ఛైర్‌పర్సన్ విజయలక్ష్మి ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. విద్యార్థుల తల్లిదండ్రులకు ముగ్గులు పోటీలు పెట్టి గెలుపొందిన వారికి బహుమతులను ప్రదానం చేశారు. వైస్ చైర్‌పర్సన్ జమున, లీల, దీపాలత, రవిచంద్రారెడ్డి, హరి ప్రసాద్‌రెడ్డి, వినాయకం, కదిరివేలు, గీత పాల్గొన్నారు.

శాంతిపురం: మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో శనివారం పేరెంట్స్ టీచర్స్ సమావేశంలో మాజీ ఎమ్మెల్సీ గానివారి శ్రీనివాసులు పాల్గొని మాట్లాడారు. ఐటీ విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ నూతన విద్యావిధానాన్ని తీసుకువచ్చారని అందులో భాగంగానే పిటిఎంను ప్రవేశపెట్టినట్లు చెప్పారు.

రసాభాసగా సమావేశం

డీఈవోని ప్రశ్నిస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులు

విజయపురం: మండలంలోని విజయపురం ఉన్నత పాఠశాలలో జరిగిన మెగా పేరెంట్స్ మీట్ రసాభాసగా ముగిసింది. ఎంఈవో హరిప్రసాద్ వర్మ ఆధ్వర్యంలో మెగా పేరెంట్స్ మీట్ కార్యక్రమం నిర్వహించారు. డీఈవో వరలక్ష్మి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా పాఠశాల మౌలిక వసతులపై విద్యార్థుల తల్లిదండ్రులు డీఈవోకు ఫిర్యాదు చేశారు. ప్రభుత్వం పాఠశాలలో వసతులు కల్పించడంలో అధికారులు విఫలమైయ్యారని, విద్యార్థులకు అసరమైన కనీస వసతులు కల్పించలేదన్నారు. రెండేళ్లకు ముందు మంజూరైన నాడు-నేడు నిధులు ఏమయ్యాయని, పాఠశాల ప్రధానోపాధ్యాయులను అడిగితే సరైన సమాధానం చెప్పడం ఫిర్యాదు చేశారు. డీఈవో విద్యార్థులు తల్లిదండ్రులు అడిగిన ప్రశ్నలకు సమాధానం చెప్పలేక మెగా పేరెంట్స్ మీట్‌లో పాల్గొనకుండానే తిరిగి వెళ్లిపోయ్యారు.

బైరెడ్డిపల్లి: మండల పరిధిలోని నెల్లిపట్ల ఉన్నత పాఠశాలలో నిర్వహించిన తల్లిదండ్రులు ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశంలో మండల అభివృద్ధి అధికారి రాజేంద్ర బాలాజీ పాల్గొని మాట్లాడారు. కడపనత్తం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోనూ సమావేశం విజయవంతంగా నిర్వహించారు. ప్రధానోపాధ్యాయులు నందగోపాల్ రెడ్డి, పీడీ చిరంజీవి, విద్యాకమిటీ చైర్మన్ ప్రభాకర్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

సోమల: మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లోనూ మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో తల్లిదండ్రుల ఉపాధ్యాయుల ఆత్మీయ సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. మహిళలకు ముగ్గుల పోటీలు పురుషులకు తాడు లాగే పోటీలను నిర్వహించి విజేతలైన వారికి బహుమతులను అందజేశారు.

తవణంపల్లి: మండలంలోని 66 పాఠశాలలో మెగా పేరెంట్స్ టీచర్ మీటింగ్ పండగ వాతావరణంలో ఘనంగా నిర్వహించడం జరిగింది. తవణంపల్లి జడ్పీ హైస్కూల్‌లో నిర్వహించిన సమావేశానికి డిఆర్‌డిఏ పీడీ శ్రీదేవి పాల్గొని విద్యార్థుల తల్లిదండ్రులకు విద్యార్థుల గురించి పలు సూచనలు సలహాలు ఇవ్వడం జరిగింది. మండల విద్యాశాఖ అధికారి టీ. త్యాగరాజు రెడ్డి, ఎగువ తవణంపల్లి సర్పంచ్ చిట్టెమ్మ, పాఠశాల కమిటీ చైర్మన్ సుజాత, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు దేవరాజురెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రొంపిచెర్ల: ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన చదువు సాధ్యమని పుంగనూరు టిడిపి ఇన్చార్జ్ చల్లా రామచంద్రారెడ్డి అన్నారు. రొంపిచర్ల మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల, బాలికోన్నత పాఠశాలలో నిర్వహించిన ఉపాధ్యాయులు తల్లిదండ్రుల ఆత్మీయ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. విద్యార్థుల తల్లిదండ్రులకు నిర్వహించిన పలు పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. పాఠశాలలో నిర్వహించే డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం, మౌలిక సదుపాయాలు, లైబ్రరీ, ప్రయోగశాలలో పనితీరు, విద్యార్థుల అభ్యాసన ఫలితాలు గురించి చర్చించారు. టిడిపి రాష్ట్ర మండల అధ్యక్షుడు, బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ ఉయ్యాల రమణ, సర్పంచ్ ఆర్.ఇబ్రహీం ఖాన్, మండల విద్యాశాఖ అధికారి శ్రీనివాసులు, ఇందిర, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు. బండకిందపల్లి పాథమిక ఉన్నత పాఠశాలలో జరిగిన తల్లిదండ్రులు ఉపాధ్యాయుల ఆత్మీయ సమ్మేళనంలో టిడిపి అధ్యక్షులు ఊటుకూరి మదన్మోహన్ రెడ్డి, సర్పంచ్ ఎస్.ఆన్సర్ బాషా, విద్యా కమిటీ చైర్మన్ ఎస్.ఆస్మా, ప్రధానోపాధ్యాయులు కె.రాములమ్మ పాల్గొన్నారు.

రొంపిచెర్లలో..

పులిచెర్ల మండలంలోని 50 పాఠశాలల్లో ఘనంగా ఉపాధ్యాయుల తల్లిదండ్రుల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈకార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పుంగనూరు టిడిపి ఇన్చార్జ్ చల్ల రామచంద్రారెడ్డి విచ్చేశారు. ఎంఈఓలు పి.తాతయ్య, సి.సిద్ధరామయ్య, సిఆర్పి కె. వేణుగోపాల్, ప్రధానోపాధ్యాయులు పి.సయ్యద్ సాహెబ్ వలి పాల్గొన్నారు.

యాదమరిలో..

అన్ని రంగాల్లో ఏపీకి ప్రాధాన్యత ఇవ్వాలి

ఎంపి దగ్గుమళ్ళ ప్రసాదరావు

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: ఆంధ్రప్రదేశ్ హక్కులను సాధించడంతో పాటు రాష్ట్ర ప్రయోజనాలే లక్ష్యంగా ఏపీ ఎన్డీఏ కూటమి ఎంపిలు అందరూ ఐక్యంగా చిత్తశుద్ధితో పని చేస్తున్నామని చిత్తూరు పార్లమెంటు సభ్యులు దగ్గుమళ్ళ ప్రసాదరావు తెలిపారు. అంతేకాకుండా అన్ని రంగాలలో ఆంధ్రప్రదేశ్‌కు ప్రాధాన్యతనివ్వాలని కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసినట్లు వివరించారు. అలాగే తమ పార్లమెంట్ నియోజకవర్గ అభివృద్ధికి సహకరించాలని ఎన్డీఏ సర్కార్‌ను కోరుతున్నట్లు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఢిల్లీ పార్లమెంటు సమావేశాలకు హాజరైన చిత్తూరు ఎంపీ శనివారం పలు అంశాలను మీడియాకు వివరించారు. ఎన్డీఏ కూటమి ఎంపీలతో కలిసి దేశంలో వేగంగా పనిచేస్తున్న గతిశక్తి మల్టీ మోడల్ కార్గో టెర్మినల్స్ అందిస్తున్న సేవలు, దీనికి సంబంధించి లొకేషన్స్ ఎక్కడెక్కడ ఉన్నాయని, ఏపీలో ఎన్ని పనిచేస్తున్నాయని, వరద వాతావరణ కార్యాలయాలు, జాతీయ విపత్తు కేంద్రాల నిర్వహణకు సంబంధించిన వివరాలను కోరుతూ కేంద్ర ప్రభుత్వానికి లేఖలు రాసినట్లు చెప్పారు. కేంద్ర సర్కార్ సానుకూలంగా స్పందించడమే కాకుండా సంబంధిత శాఖల నుంచి సమాధానమిస్తూ లేఖలు పంపినట్లు తెలియజేశారు. దేశ వ్యాప్తంగా 354 గతిశక్తి మల్టీ మోడల్ కార్గో టెర్మినల్స్ సేవలందించినట్లు భారతీయ రైల్వే శాఖామంత్రి లేఖలో వివరించారని చెప్పారు. గతిశక్తి కార్గో టెర్మినల్ అనేది భారతీయ రైల్వేలు సరకు రవాణాను మెరుగుపరచడానికి ఏర్పాటు చేసిందని ఆయన పేర్కొన్నారు. సరకు రవాణా ఆదాయాన్ని పెంచడం, ట్రాక్ రద్దీని తగ్గించడం, రైలు కార్గోలను నిర్వహించడానికి అదనపు టెర్మినల్స్ అభివృద్ధి చేయడం వంటి లక్ష్యాలతో ఈ టెర్మినల్స్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వీటన్నింటిని సాధించుకోవడం ద్వారా ఆంధ్రప్రదేశ్ పురోభివృద్ధి వైపు పయనిస్తుందని తెలిపారు.

రోడ్లను బాగు చేయండి

మండల సర్వసభ్య సమావేశంలో సభ్యులు

సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ అనిత

ప్రజాశక్తి-గంగాధర నెల్లూరు: మండలంలోని పలు గ్రామాల్లో అధ్వానంగా మారిన ఆర్ అండ్ బి రోడ్లను బాగు చేయాలని ఎంపిటీసీలు, సర్పంచులు మండల సర్వసభ్య సమావేశంలో ధ్వజమెత్తారు. గంగాధర నెల్లూరు మండల సర్వసభ్య సమావేశం శనివారం ఎంపీపీ అనిత అధ్యక్షతన జరిగింది. కలిజవేడు సర్పంచ్ నీలావతి మాట్లాడుతూ కలిజవేడులోఉన్న వెల్నెస్ క్లినిక్‌ను ఆ పంచాయతీ పరిధిలోని కె.నాశంపల్లికి మార్చిడి చేయాలని డిమాండ్ చేశారు. వెజ్జు పల్లి సర్పంచ్ హరిప్రసాద్ రెడ్డి గ్రామాల్లో వీధిలైట్లు రాత్రింబవళ్లు వెలుగుతూనే ఉన్నాయని దీనివల్ల విద్యుత్ చార్జీల భారంగా మారిందన్నారు. అంగన్వాడీ సూపర్వైజర్ బింధుమాలతి మాట్లాడుతూ మండలంలో మినీ అంగన్వాడి కేంద్రాలను మెయిన్ అంగన్వాడి కేంద్రాలుగా అప్ గ్రేడ్ చేయడానికి ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపించినట్లు పేర్కొన్నారు. మండలంలో అర్హులైన రైతులకు గోకులం షెడ్లు ప్రతి ఒక్కరికి మంజూరు చేయాలని, పశుగ్రాసం పెంపకానికి ఒక్కొక్క రైతుకు ఒక ఎకరా పెంచాలని సర్పంచులు కోరారు. బుక్కాపట్నం సర్పంచ్ ముని రాజారెడ్డి మాట్లాడుతూ ప్రతి పంచాయతీలో ఏఎన్ఎం సర్పంచ్ జాయింట్ ఖాతాలో ఎన్ఆర్ హెచ్ఎం నిధులు నిరుపయోగంగా మురిగిపోతున్నాయని, వాటిని డ్రాచేసి పంచాయతీలో పారిశుద్ధం పనులకు ఉపయోగించాలని కోరారు. జడ్పిటిసి లక్ష్మీప్రియ, వైస్ ఎంపీపీలో హరిబాబు, బేబీ, ఎంపీడీవో హరిప్రసాద్‌రెడ్డి, తహసిల్దార్ చంద్రశేఖర్, హౌసింగ్ ఏఈ శ్రీధర్, ఎంఈఓ ఆంజనేయులు శెట్టి, వెలుగు ఏపిఎం ఫరీద్ మస్తాన్, విద్యుత్ ఏఈలు వరదరాజులు, తంగవేలు, ఏవో భవాని పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయం సాగు పద్ధతులను అనుసరించేలా

కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేయాలి

ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్

ప్రజాశక్తి- కుప్పం టౌన్ రాబోయే 5 సంవత్సరాల్లో కుప్పం నియోజకవర్గంలో ప్రతి గ్రామంలో ప్రకృతి వ్యవసాయం సాగు పద్ధతులను అనుసరించేలా కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేయాలని ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ పేర్కొన్నారు. శనివారం కుప్పం ఆర్ అండ్ బి అతిథి గృహంలో ఎమ్మెల్సీ వ్యవసాయ శాఖ ప్రభుత్వ సలహాదారు టి.విజయ్ కుమార్ , కడా పీడీ వికాస్ మర్మత్‌లతో కలసి కుప్పం నియోజకవర్గంలో ప్రకృతి వ్యవసాయం విస్తరణపై సంబందిత అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల్లో ప్రకృతి వ్యవసాయం సాగు విధానంపై అవగాహన పెంచాలని, ప్రకృతి వ్యవసాయం సాగు పద్ధతులపై సోషల్ మీడియా ద్వారా ప్రచారం కల్పించాలన్నారు. ప్రతి కుటుంబం ప్రకృతి వ్యవసాయం చేసే విధంగా ఖర్చు తగ్గించుకొని ఆరోగ్య వంతమైన ఆహారాన్ని తినే విధంగా అలవాటు చేయాలని ఇందుకు క్షేత్ర స్థాయిలో వ్యవసాయ సిబ్బంది ఎంతో కృషి చేయాలన్నారు. ఈ దిశగా సంబంధిత అధికారులందరూ సమన్వయంతో పనిచేయాలన్నారు. తద్వారా రాబోయే 5 సంవత్సరాల్లో కుప్పం నియోజకవర్గంలో ప్రతి గ్రామంలో ప్రకృతి వ్యవసాయం సాగు పద్ధతులను అనుసరించేలా కృషి చేయాలన్నారు. విజయ్ కుమార్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రకృతి వ్యవసాయం సాగుకు ప్రాధాన్యత ఇస్తుందని, కుప్పం నియోజకవర్గంలో ఈ సాగును అబివృద్ధి చేసేలా ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. కడా పీడీ మాట్లాడుతూ కుప్పం నియోజకవర్గంలో 20,052 ఎకరాలలో 18,009 మంది ప్రకృతి వ్యవసాయాన్ని అనుసరిస్తున్నారని, బీడు భూములను వ్యవసాయ సాగుకు అనుకూలంగా మార్చి 365 రోజులు పంటలు సాగు చేసేలా ప్రణాళికలను సిద్ధం చేయాలని ఆదేశించారు. జిల్లా వ్యవసాయ, హార్టికల్చర్ అధికారులు మురళీకృష్ణ, మధుసూధన్ రెడ్డి, డిపిఎం వాసు అడిషనల్ డిపిఎం శ్రీనివాస్ రావు, రాష్ట్ర అధికారులు చంద్రశేఖర్ పాల్గొన్నారు.

థెరపీ మిషన్ వితరణ

ప్రజాశక్తి- పెద్దపంజాణి: తల్లి ప్రసవించిన తర్వాత శిశువును ఆరోగ్యవంతంగా సంరక్షించడానికి నియోనేటల్ రేడియంట్ వార్మర్ విత్ ఫోటో థెరపీ మిషన్ అవసరమని స్థానిక వైద్యాధికారి టీ.మురళి మండల పత్రిక విలేకరుల దృష్టికి తీసుకురాగా స్పందించిన మండల విలేకరులు, యువనాయకులు సునీల్‌రెడ్డికి విషయం తెలియజేశారు. దీంతో ప్రాథమిక వైద్యశాలకు అవసరమైన నియోనేటల్ రేడియంట్ వార్మర్ విత్ ఫోటో థెరపీ మిషన్‌ను వితరణ చేసేందుకు చొరవ చూపారు. ఈ మేరకు శనివారం పలమనేరు ఎమ్మెల్యే అమరనాథరెడ్డి మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో చిన్నపిల్లల సంరక్షణ కొరకు వినియోగించే నియోనేటల్ రేడియంట్ వార్మర్ విత్‌ఫోటో థెరపీ మిషన్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా మిషన్ పనితీరును తల్లి ప్రసవించిన తర్వాత శిశువును ఆరోగ్యవంతంగా కాపాడుటకు ఈ పరికరం ఎంతో ఉపయోగకరమని డాక్టర్ టి.మురళి ఎమ్మెల్యేకు వివరించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి విరాళంగా అందించిన గుండ్లపల్లి గ్రామానికి చెందిన సునీల్ రెడ్డిని, స్పందించిన పత్రిక విలేకరులను ఆయన అభినందించారు. ఎంపీపీ రెడ్డప్ప, ఎంపీడీవో బాలాజీ, మాజీ ఎంపీపీ విజయభాస్కర్ రెడ్డి, ఆనంద, మురహరి రెడ్డి, సుధాకర్ రెడ్డి, రోజా కృష్ణారెడ్డి, వేమారెడ్డి పాల్గొన్నారు.

విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి

ప్రజాశక్తి- కుప్పం టౌన్: విద్యార్థులు కేవలం విద్యలోనే కాకుండా క్రీడాలలోనూ రాణించాలని ఇంజనీరింగ్ కళాశాల వైస్‌చైర్మన్ డాక్టర్ సునీల్ రాజు సూచించారు. శనివారం ఆయన కుప్పం లయన్స్ క్లబ్ ఆఫ్ వారియర్స్ వారితో కలిసి బిసి వసతి గృహవిద్యార్థులకు క్రీడాసామాగ్రిని అందజేశారు. వారు మాట్లాడుతూ విద్యార్థులు మానసికంగా శారీరకంగా దృఢత్వాన్ని పెంపొందించుకున్నప్పుడే మంచి విద్యను అభ్యసించ గలుగుతారని, మానసిక శారీరక దృఢత్వానికి క్రీడలు ఎంతగానో సహకరిస్తుందన్నారు. కావున విద్యార్థులు క్రీడలలో రాణించాలన్న ఉద్దేశంతో రూ.20వేలు విలువ చేసే క్రీడా సామాగ్రిని అందించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమానికి లయన్స్ క్లబ్ అడ్వైజర్ మహేష్, అధ్యక్షులు సోమశేఖర్, డైరెక్టర్స్ సతేంద్ర శేఖర్, నితిన్ కుమార్, షరీఫుల్లా, హాస్టల్ వార్డెన్ మురళి నాయక్, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆకతాయిల వేగానికి అడ్డుకట్ట

ప్రజాశక్తి- కుప్పం రూరల్: ఆకతాయిల వేగానికి అడ్డుకట్ట వేయడానికి పట్టణంలో స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేస్తున్నట్టు కుప్పం నియోజకవర్గ టిడిపి విస్తరణ విభాగ కమిటీ సభ్యులు కన్నన్ తెలిపారు. శనివారం కొత్తపేట ప్రాంతంలో జరుగుతున్న రోడ్డు పనులను ఆయన కొత్తపేట ఇంచార్జ్ ముఖేష్‌తో కలిసి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ మధ్య కురిసిన వర్షాలకు రోడ్లు గుంతల మయంగా మారడంతో ప్రయాణికులు తీవ్రఇబ్బందులు ఎదుర్కొంటున్నట్టు తెలిపారు. అలాగే ఆకతాయి యువత ద్విచక్ర వాహనాలను వేగంగా నడుపుతూ స్థానికులను భయభ్రాంతులకు గురిచేస్తున్నట్టు తెలిపారు. వీరి వేగాన్ని నిరోధించడానికి రోడ్లపై స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయడంతో పాటు రోడ్లపై గుంతలను పూడ్చడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ సుబ్బు, షాదీ మహల్ మాజీ అధ్యక్షులు అన్సర్ బాష, టిడిపి నాయకులు కందస్వామి, సుకుమార్, సుజిత్ పాల్గొన్నారు.

అవగాహన ర్యాలీ

ప్రజాశక్తి - సదుం: లింగ హింసకు వ్యతిరేకంగా 16 రోజుల క్రియాశీలత వార్షిక అంతర్జాతీయ ప్రచారంలో భాగంగా మండల పరిధిలోని సజ్జలవారిపల్లి ఎంపీపీ పాఠశాలలో

ప్రధానోపాధ్యాయురాలు శోభారాణి ఆధ్వర్యంలో శనివారం అవగాహ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు, బాలికలపై జరుగుతున్న హింస నిర్మూలన కోసం ప్రజల్లో అవగాహన కల్పించడానికి ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని ఆమె తెలిపారు. అంగన్వాడీ వర్కర్ హేమలత, ఏఎన్ఎం సుధారాణి, హెల్త్‌సూపర్వైజర్ నీలకంఠ పాల్గొన్నారు.

నేమ్ బోర్డు వితరణ

ప్రజాశక్తి- పలమనేరు: స్థానిక లక్ష్మీనగర్‌లోని ప్రాథమిక పాఠశాలలో గత 22 ఏళ్లుగా సరైన నేమ్ బోర్డు లేక ఉపాధ్యాయులు, విద్యార్థులు ఇబ్బంది పడేవారు. దీంతో స్పందించిన దాత శ్రీపురం సీతారామయ్య రూ.10వేలు విలు చేసే నేమ్ బోర్డును శనివారం ప్రధానోపాధ్యాయులు జయంతికి అందజేశారు. పాఠశాల అభివృద్ధికి సహకరిస్తున్న దాతను ఎంఈవో బాలసుందరం అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు నరేంద్ర, మహేశ్వరి, గురుమూర్తి, రిటైర్డ్ ఉపాధ్యాయులు విజయ్ కుమార్, సెల్వకుమార్ పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో

మతపరమైన లెక్కల సేకరణ ఆపండి

సిపిఎం జిల్లా కన్వీనర్ వాడ గంగరాజు

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: ముస్లిం, క్రిస్టియన్ మైనారిటీల పిల్లల లెక్కలను 2014 నుండి 2023 వరకు పుట్టిన వారి వివరాలు, అందులో అంగన్వాడీ కేంద్రాలలో చేరినవారి నిష్పత్తి సేకరించి 24 గంటల్లో పంపాలన్న రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలను తక్షణం నిలుపుదల చేయాలని సిపిఎం జిల్లా కన్వీనర్ వాడ గంగరాజు శనివారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. ఒక వైపు కుల గణన చేయాలని సిపిఎం సహ అనేక ప్రతిపక్షాలు డిమాండ్ చేస్తున్నా తిరస్కరిస్తున్న ప్రభుత్వం మరోవైపు గుట్టుచప్పుడు కాకుండా రాజ్యాంగ విరుద్ధంగా మత పరమైన వివరాలు సేకరించడం వెనుక ఎజెండా ఏమిటో ప్రభుత్వం వివరణ ఇవ్వాలన్నారు. రాష్ట్రంలో మత ఉద్రిక్తతలు పెంచడానికి, పిల్లలు, తల్లులలో భావోద్రేకాలు రెచ్చగొట్టేందుకు తోడ్పడే ఈ లెక్కల సేకరణను సిపిఎం జిల్లా కమిటీ కమిటీ తీవ్రంగా వ్యతిరేకిస్తున్నదని తెలిపారు. ఐసిడిఎస్ శాఖ జారీ చేసిన సర్క్యులర్ వెనుక నిగూఢ ఎజెండా దాగి ఉందని, ఎందుకోసం సేకరిస్తున్నారో చెప్పకుండా గుట్టుగా వివరాలు పంపమని చెప్పడం పలు అనుమానాలకు దారి తీస్తుందని, తక్షణం సిఎం జోక్యం చేసుకొని మతవివరాల సేకరణ ఆపాలని డిమాండ్ చేశారు.

సిసి రోడ్డు నిర్మాణానికి భూమి పూజ

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: చిత్తూరు సమగ్ర అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని, నగరాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి చేస్తామని ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ చెప్పారు. శనివారం చిత్తూరు నగర పాలక పరిధిలోని కోడిగుట్ట ఇందిరమ్మ కాలనీలో రూ.13 లక్షలతో నిర్మించనున్న సిమెంటు రోడ్డుకు ఎమ్మెల్యే భూమి పూజ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ చిత్తూరు నగరంలోని 50 డివిజన్లో మౌలిక సదుపాయాలైన సిమెంట్ రోడ్లు, మురుగునీటి కాలువల నిర్మాణానికి నిధులు కేటాయించాలని ప్రభుత్వాన్ని కోరినట్టు చెప్పారు. గత అసెంబ్లీ సమావేశాల సందర్భంగా నగర అభివృద్ధికి సంబంధించి సమగ్రమైన అంచనాలతో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుని కలిసి విన్నవించడం జరిగిందని, త్వరలోనే నిధులు విడుదలవుతాయని చెప్పారు. స్థానిక ప్రజలతో మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో మేయర్ ఎస్.అముద, కమిషనర్ పి.నరసింహ ప్రసాద్ పాల్గొన్నారు.

గురుకుల విద్యార్థులపై నిర్లక్ష్యం వీడాలి..

ఎస్ఎఫ్ఐ జిల్లా కన్వీనర్ వినోద్ కుమార్

ప్రజాశక్తి- బంగారుపాళ్యం: రాష్ట్ర ప్రభుత్వం ట్రైబల్, గురుకుల విద్యార్థుల పట్ల నిర్లక్ష్యం విడాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కన్వీనర్ వినోద్ కుమార్ కోరారు. శనివారం మండల కేంద్రంలోని ట్రైబల్ గురుకుల పాఠశాలలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా వినోద్ కుమార్ మాట్లాడుతూ గత నెల 25వ తేదీ నుంచి అవుట్ సోర్సింగ్ అధ్యాపకులు వారి న్యాయమైన సమస్యల కోసం సమ్మెలో ఉంటే ప్రభుత్వం వారి సమస్యలు పరిష్కరించకపోవడంతో 10వ తరగతి విద్యార్థులకు పాఠ్యాంశాలు పూర్తికాక విద్యార్థత కోల్పోతున్నారని తెలిపారు. అసలే పోటీ తత్వంతో ఉన్న విద్యారంగంలో గురుకులాల్లో ఉన్న విద్యార్థుల పట్ల రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం వీడాలని, విద్యను బోధిస్తున్న అధ్యాపకులు సమ్మెలో ఉంటే ఈ విద్యాసంవత్సరం వృధా అయిపోతుందని విద్యార్థులు వారి తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. ఇకనైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి ట్రైబల్ గురుకుల పాఠశాల విద్యార్థుల పట్ల న్యాయమైన కోర్కెలు తీర్చి వారి విద్యారంగాన్ని అభివృద్ధి చేసుకునే విధంగా చూడాలన్నారు.

ప్రతిభ చూపిన పిఈఎస్ విద్యార్థులు

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: ఆర్ట్ ఫెస్ట్ – 2024లో భాగంగా కేన్డోర్ నేషనల్ పబ్లిక్ పాఠశాల వేదికగా శనివారం ఆర్ట్ కాంపిటీషన్ నిర్వహించడం జరిగింది. ఈ కాంపిటీషన్లో తిరుపతి పరిసర ప్రాంత పాఠశాలలకు చెందిన దాదాపు 150 మంది విద్యార్థులు పాల్గొన్నారు. అందులో మొదటి కేటగిరీలో 1వ తరగతికి చెందిన డి.మాన్సి మొదటి బహుమతిని అందుకోగా, బి.మాన్వి రెండవ బహుమతిని కైవసం చేసుకున్నారు. రెండవ కేటగిరీలో 6వ తరగతికి చెందిన ఎండి. చందన్ రెండవ బహుమతిని, మూడో కేటగిరీలో 8వ తరగతికి చెందిన ఎండి.తమన్నా మొదటి బహుమతిని సొంతం చేసుకొంది. ఈ సందర్భంగా పిఈఎస్ పబ్లిక్ పాఠశాల ప్రిన్సిపాల్ వైవి.కృష్ణబాబు శిక్షణను అందించిన ఆర్ట్ మాస్టర్ దినేష్, గెలుపొందిన విద్యార్థులను అభినందించారు.

నియోజకవర్గంలో ఎమ్మెల్యే థామస్ పర్యటన

ప్రజాశక్తి - ఎస్ఆర్ పురం: ప్రైవేటు పాఠశాలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలను తీసుకురావాలన్నదే రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ధ్యేయమని ప్రభుత్వ విప్ నియోజకవర్గ ఎమ్మెల్యే డాక్టర్ థామస్ అన్నారు. శనివారం నియోజకవర్గంలో ఆయన సుడిగాలి పర్యటనలు చేసి పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యార్థులందరూ క్రమశిక్షణతో బాగా చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. విద్యార్థుల భవిష్యత్తు విద్యాభివృద్ధి కోసం బడివైపు ఒక అడుగు వేద్దామని అన్నారు. ఎస్ఆర్‌పురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలో ఎంఈఓలు అరుణాచల రెడ్డి, సబర్మతి ఆధ్వర్యంలో నిర్వరహించిన తల్లిదండ్రులు ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశాన్ని ప్రారంభించారు. అనంతరం కొత్తపల్లిమిట్ట జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాలో పిఎంశ్రీ కేంద్ర పథకం ద్వారా పాఠశాలకు ప్రభుత్వం అందించిన కంప్యూటర్ ల్యాబ్‌ను ప్రారంభించారు. అలాగే ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించి మొక్కలను నాటారు. కుల వృత్తి పథకంలో లబ్ధిదారులకు కార్పెంటర్ యంత్రాన్ని లబ్ధిదారునికి ఎంపీడీవో మోహన్ మురళి ఆధ్వర్యంలో ఎమ్మెల్యే థామస్ అందించారు. పుల్లూరు క్రాస్‌లో పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ ఎమ్మెల్యే ప్రభుత్వ విప్‌గా నియమించిన తర్వాత మొదటిసారి నియోజకవర్గంలో అడుగుపెట్టడంతో తెలుగు తమ్ముళ్లు ఆయనను సన్మానించారు. మండలంలోని గత నాలుగు రోజులకు ముందు పాతపాలెం గ్రామంలో అంబేద్కర్ విగ్రహాన్ని ఎవరో గుర్తుతెలియని వ్యక్తులు పగలగొట్టిన సంఘటన స్థలానికి వెళ్లి పరిశీలించారు. ఎస్ఆర్.పురం ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్‌రావు, పాఠశాల కమిటీ చైర్మన్లు, ప్రహ్లాధన్, ప్రభాకర్, స్కూల్ కమిటీ డైరెక్టర్లు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కంప్యూటర్ ల్యాబ్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ థామస్

కుప్పం అభివృద్ధికి రూ.110 కోట్లు మంజూరు: ఎమ్మెల్సీ

ప్రజాశక్తి- గుడిపల్లి: కుప్పం నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేయడానికి రూ.110 కోట్ల 21 లక్షలు నిధులు మంజూరు చేయడం జరిగిందని ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ శనివారం విలేకర్ల సమావేశంలో తెలిపారు. నియోజకవర్గంలో మురుగునీటి కాలువ నిర్మాణాలు, మౌలిక వసతుల కల్పన, 451 అభివృద్ధి పనులకు నిధులు మంజూరైనట్లు పేర్కొన్నారు. కుప్పం అభివృద్ధికి రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, కూటమి ప్రభుత్వం పని చేస్తోందని తెలిపారు. రాష్ట్ర ఆర్టీసీ వైస్ ఛైర్మన్ పిఎస్. మునిరత్నం, నియోజకవర్గం సమన్వయ కమిటీ కన్వీనర్ ఆర్.చంద్రశేఖర్ మాట్లాడుతూ కుప్పం నియోజకవర్గంలో మారుమూల గ్రామాలను సైతం ఎంచుకుని అభివృద్ధి చేయడం హర్షించదగ్గ విషయమన్నారు. ఈ సందర్భంగా సిఎం చంద్రబాబుకు, డిప్యూటి సిఎం పవన్ కళ్యాణ్‌కు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు.

స్మార్ట్ లాక్స్‌ను సద్వినియోగం చేసుకోండి

ప్రజాశక్తి- విజయపురం: స్మార్ట్ లాక్స్‌ను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఎస్ఐ బలరాం తెలిపారు. శనివారం విజయపురం పోలీసుస్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఎస్ఐ మాట్లాడుతూ ఇంటికి స్మార్ట్ లాకర్ ఏర్పాటు చేసుకోవడంలన దుండగుల నుండి రక్షణ పొందవచ్చున్నారు. ఇంటికి లాకర్ సెట్ చేస్తే ఎవరైనా తాకినా, తొలగించడానికి ప్రయత్నం చేసినా అలారం మోగుతుందని, తద్వారా సులభంగా దొంగతనాలకు, చోరీలకు పాల్పడేవారిని గుర్తించవచ్చున్నారు. స్మార్ట్ లాకర్ ధర రూ.400లు ఉంటుందని, ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మండల టీడీపీ అధ్యక్షుడు రమేష్ రాజు, ప్రధాన కార్యదర్శి బాబు యాదవ్, హెడ్ కానిస్టేబుల్ చెంగయ్య, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

బైరెడ్డిపల్లి: స్థానిక పోలీస్ స్టేషన్లో ఎస్సై పరశు రాముడు అధ్యక్షతన స్మార్ట్ లాక్ విధానంపై పలమనేరు రూరల్ సిఐ మురళీమోహన్ శనివారం ప్రజలకు అవగాహన కల్పించారు. స్మార్ట్ లాక్ అమర్చుకోవడం వలన చోరీలను అరికట్టవచ్చు అని తెలిపారు.

అపరిచితుల పట్ల అప్రమత్తంగా ఉండాలి: ఎస్సై

రామకుప్పం: గ్రామాల్లో అపరిచితుల సంచారం పట్ల స్థానికులు అప్రమత్తంగా ఉండి.. అనుమానం కలిగితే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని రామకుప్పం ఎస్సై వెంకట మోహన్ కోరారు. శనివారం రాత్రి రామకుప్పం మండల పరిధిలోని ఉంసిగానిపల్లి పంచాయతీ, గోవిందపల్లి గ్రామంలో ప్రజలకు స్మార్ట్ లాక్స్‌పై అవగాహన కల్పించారు. రాత్రి వేళల్లో అపరిచితుల ఇళ్ల తలుపులు తడితే బయటకు రాకూడదన్నారు. ముఖ్యంగా వ్యవసాయ పంపు సెట్లవద్ద, దుఖాణాలకు, ఇళ్లకు తాళాలు వేసి పొరుగు గ్రామాలకు వెళ్ళే వారికి ఈ స్మార్ట్ లాక్ లు ఎంతగానో ఉపయోగ పడుతాయన్నారు.

ఎస్సీ, ఎస్టీ ఉపాధి హామీ ఉద్యోగుల సేవా సంఘం ఏర్పాటు

ప్రజాశక్తి- యాదమరి: మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం కింద పనిచేసే ఉపాధి హామీ ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సేవా సంఘంను ఏర్పాటు చేసినట్టు ఆ సంఘం గౌరవాధ్యక్షులు బి.సునీల్ కుమార్ తెలిపారు. శనివారం చిత్తూరు జిల్లాలో ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సేవా సంఘం (ఆంధ్రప్రదేశ్ రిజిస్టర్ నంబర్: 355 /2024) సమావేశమై కార్యనిర్వాహక కమిటీని ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షులు బి. సునీల్ కుమార్, అధ్యక్షులు కే.గుణశేఖర్, ఉపాధ్యక్షులు ఎస్. వాలే నాయక్, కార్యదర్శి టి.అన్నామలై, ఉపకార్యదర్శి టి.అనూష, కోశాధికారి ఎస్.విశ్వనాధ్, ఎగ్జిక్యూటివ్ సభ్యులు ఎన్.బాల, జి.కిరణ్ కుమార్, కే.పరమశివ, ఎస్.గౌతం కుమార్, ఆర్.కిరణ్ ప్రసాద్, కే.మునిరాజు, వై.బాలన్, ఎం.పరదేశి, ఏ.ఈశ్వరయ్య, కె.గోవిందరాజులును ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా చిత్తూరు జిల్లా ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న ఎస్సీ ఎస్టీ ఉద్యోగుల సేవా సంఘంను 51 మందితో ఏర్పాటు చేయడం జరిగింది.

శుభకార్యాలకు మ్యాంగో జ్యూస్ వాడాలి

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: తెలుగువారు సాంప్రదాయ పద్ధతిలో నిర్వహించే శుభకార్యాలకు మ్యాంగో జ్యూస్‌ను వాడాలని పండ్ల పరిశ్రమల సమాఖ్య కోరింది. శనివారం కన్సార్టియం ఆఫ్ ఫార్మర్ ప్రొడ్యూసర్స్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో రాబోయే 2025 సంవత్సరం మామిడి పంటపై స్థానిక కేబిఆర్ మ్యాంగో భవన్‌లో చిత్తూరు, తిరుపతి, అన్నమయ్య జిల్లాలలోని ఎఫ్‌పిఓ సభ్యులతో పాటు గుజ్జు పరిశ్రమ యజమానులు, ఉద్యానశాఖ అధికారులు, ఆత్మ సభ్యురాలు, మార్కెటింగ్ శాఖ అధికారులతో రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. రైతులు ఎదుర్కొంటున్న మార్కెటింగ్ సదుపాయాలు, పంట ఖర్చుల తగ్గింపు, సస్యరక్షణ, నీటి యాజమాన్య పద్ధతులపై చర్చించారు. గుజ్జు పరిశ్రమలో రైతులకు, ఎఫ్‌పిఓ సంస్థలకు మామిడి సప్లై, నగదు పంపిణీలో ప్రాముఖ్యత ఇవ్వాలని సభ్యులు కోరారు. ప్రతి రైతు తమ ఇళ్లల్లో జరిగే శుభకార్యాలలో మామిడి జ్యూస్‌ను విధిగా వాడే విధంగా కూడా చర్యలు చేపట్టాలని మ్యాగో గుజ్జు పరిశ్రమ సమాఖ్య కోరింది. దేశీయ మార్కెట్లో మామిడి ఉత్పత్తులు వినియోగం ఎక్కువ కావడం, ప్రజలకు పండ్ల రసాలపై అవగాహన కూడా ఏర్పడుతుందని వక్తలు అభిప్రాయపడ్డారు. సమాఖ్య కార్యదర్శి, ఆలిండియా ఫుడ్ ప్రాసెసర్స్ అసోసియేషన్ సౌత్‌జోన్ ఛైర్మన్ కట్టమంచి బాబి, పరిశ్రమ యజమానులు శివకుమార్, తలపలపల్లి బాబురెడ్డి, బాలాజీ, చంద్ర, చంద్రమోహన్, శ్రీధర్, చంద్రబాబు, సిఎఫ్‌పిఓ కార్యదర్శి ఆనందనాయుడు, ఉద్యానశాఖ అధికారి మధుసూదన్‌రెడ్డి, మార్కెటింగ్ అధికారి పరమేశ్వరన్, ఏడి ఆత్మ సావిత్రి పాల్గొన్నారు.

క్రైం న్యూస్

ప్రియుడితో కలిసి భర్త హత్య

ప్రజాశక్తి- శాంతిపురం: వివాహేతర సంబంధానికి అడ్డుగా ఉన్నాడని ప్రియుడితో కలిసి కట్టుకున్న భర్తను హతమార్చిన సంఘటన మండల పరిధిలోని సోలిశెట్టిపల్లి గ్రామంలో శనివారం వెలుగు చూసింది. రాళ్ళబుదుగురు ఎస్సై నరేష్ కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. సోలిశెట్టిపల్లి గ్రామానికి చెందిన మీనా తన భర్త గోవిందప్ప (38) ఈనెల 4వ తేదీన నుండి కనిపించడం లేదంటూ 5న రాళ్ళబుదుగురు పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసింది. దీంతో పోలీసులు విచారణ ప్రారంభించారు. గోవిందప్ప కుటుంబ సభ్యులను, మిత్రులను విచారించి రాళ్ళబుదుగురుకు చెందిన ఆనంద్ అనే వ్యక్తితో మీనాకు పరిచయం ఉన్నట్లు తెలిసిందన్నారు. విచారణలో భాగంగా ఆనంద్‌ను పోలీసులు విచారించగా ఈనెల 4వ తారీఖున మీనా, మునిరాజు అనే మరో వ్యక్తి సహాయంతో గోవిందప్పను హతమార్చి గుడిపల్లి మండలం బిసానత్తం గ్రామం సమీపంలోని కర్ణాటక సరిహద్దుల్లో మృతదేహాన్ని పడేసినట్లు ఆనంద్ స్వయంగా ఒప్పుకున్నట్లు తెలిపారు. ఈ మేరకు ముగ్గురు నిందితులను అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

వాహనం ఢీకొని బాలిక మృతి

ప్రజాశక్తి- పూతలపట్టు: నాయుడుపేట జాతీయ రహదారిలోని రంగంపేట సూర్య హోటల్ వద్ద వాణిశ్రీ (14) శుక్రవారం రాత్రి 11 గంటల సమయంలో రోడ్డు దాటుతుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో తీవ్రంగా గాయపడింది. స్థానికులు బాలికను చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ శనివారం ఉదయం మృత్యువాత పడింది. ఈ మేరకు పూతలపట్టు ఏఎస్ఐ రమణారావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బాల్యవివాహాలను అరికట్టాలి : సిఐ

ప్రజాశక్తి- బంగారుపాళ్యం: బాల్యవివాహాలను అరికట్టి, కిషోర్ బాలికల ఎదుగుదలకు తోడ్పడాలని సిఐ శ్రీనివాసులు తెలిపారు. శనివారం మండల కేంద్రంలోని కార్యాలయంలో సిడిపిఓ వాణిశ్రీదేవి ఆధ్వర్యంలో కిషోర్ బాలికల రక్షణపై ఒకరోజు శిక్షణా కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ 11 నుంచి 18 సంవత్సరాల లోపు కిషోర బాలికలు వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కలిగి ఉండాలని, పౌష్టికాహారం తీసుకుంటా రక్త హీనత భారన పడకూడదని తెలిపారు. ఆడపిల్లలకు 18 సంవత్సరాలు నిండకుండా వివాహాలు చేస్తే వారు గర్భిణులుగా ఉన్నసమయంలో సరైన పౌష్టికాహారం లేక మాతాశిశు మరణాలు సంభవించే ప్రమాదం ఉందని అన్నారు. అంతేకాకుండా వారు అనారోగ్యం భారినపడతారని తెలిపారు. గ్రామాల్లో బాల్యవివాహాలను అరికట్టాలని, గ్రామాల్లోని అంగన్వాడీ, ఆరోగ్య కార్యకర్తలు సచివాలయ జిఎంఎస్‌కెలు పరిశీలించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డిఎల్ఓ వెంకటేష్, ఎంపిడిఓ శ్రీధర్, ఎంఈవో నాగేశ్వరరావు, తుంబకుప్పం పిహెచ్‌సి వైద్యులు లోహిత్ చంగల్ రాయులు, సూపర్వైజర్లు జయశ్రీరెడ్డి, కళ్యాణి పాల్గొన్నారు.

అంబేద్కర్‌ను ఆదర్శంగా తీసుకోవాలి

ప్రజాశక్తి- కుప్పం టౌన్: రాజ్యాంగ సృష్టికర్త డాక్టర్ బిఆర్ అంబేద్కర్ సిద్ధాంతాలను నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలని బిసిఎన్ విద్యాసంస్థల అధినేత బిసి.నాగరాజు తెలిపారు. శనివారం కుప్పం ఇంజనీరింగ్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో అంబేద్కర్ వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన బీసీఎన్ విద్యాసంస్థల అధినేత అంబేద్కర్ చిత్రపటానికి ఘనంగా నివాళులు అర్పించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సుధాకర్ బాబు, వైస్ ప్రిన్సిపాల్ భాస్కరన్, ఆర్ అండ్ డి డైరెక్టర్ కోదండ రామయ్య, ఎన్ఎస్-ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ మాధవన్, కోఆర్డినేటర్ గంగాధరన్, పిఆర్ఓ ప్రవీణ్ కుమార్, అధ్యాపకులు, ఎన్ఎస్ఎస్ వాలింటర్స్ పాల్గొన్నారు.

మామిడి సాగుపై అవగాహన

ప్రజాశక్తి- బంగారుపాళ్యం: మామిడి సాగుకు శాస్త్రవేత్తల సలహాలు పాటించాలని జిల్లా ఉద్యానశాఖ అధికారి మధుసూదన్ రెడ్డి తెలిపారు. శనివారం మండలంలోని మామిడి రైతులకు మామిడి మార్కెట్ యార్డులో మండల ఉద్యానవన శాఖ అధికారి సాగరిక ఆధ్వర్యంలో మామిడి సాగుపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ ప్రస్తుత మామిడిలో రైతులు ఆచరించాల్సిన సస్యరక్షణ చర్యలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. మామిడిలో ప్రధాన సమస్యలైన తేనె మంచు, బూడిద తెగులు నివారణకు చేయవల్సిన యాజమాన్యం, వినియోగించాల్సిన మందుల గురించి వివరించారు. అలాగే మామిడిలో విడతల వారీగా పిచికారీ చేయాల్సిన మందులు గురించి రైతులకు తెలియజేశారు.ఏపిఎంఐపి ప్రాజెక్టు డైరెక్టర్ బాలసుబ్రమణ్యం, తిరుపతి నిమ్మ పరిశోధనా స్థానం నుండి శాస్త్రవేత్త డాక్టర్ రంజిత్ కుమార్ పాల్గొన్నారు.